# ప్రజా మైత్రి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 29 | శుక్రవారం | 25 - 09 - 2026 | పేజిలు : 04 | వెల రూ. 2




హైదరాబాద్ గణేశ్ బందోబస్తు విధుల్లో ఎస్సై దుర్మరణం..
నిందితుడి కోసం పోలీసుల గాలింపు


## సీఎం రేవంత్‌కు 'ముహమ్మద్' అవార్డు ప్రదానం

- బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026కు రేవంత్‌రెడ్డి ఎంపిక
- కేరళ నిలంబూరులో అవార్డు ప్రదానోత్సవం
- రైతు, బీసీ, ప్రజా సంక్షేమ పాలనకు గుర్తింపు
- రైతులు, బీసీలు, సామాన్య ప్రజల సంక్షేమానికి వినూత్న కార్యక్రమాలు
- ప్రజాస్వామిక విలువలపై నిబద్ధతను కొనియాడిన జ్యూరీ
- రూ.లక్ష నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేత



**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026' (ఉత్తమ ప్రజా సేవకుడు) అవార్డుకు ఎంపికయ్యారు.కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టి గల నాయకత్వానికి గాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపికకు ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి.అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ జ్యూరీగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను జ్యూరీ ప్రత్యేకంగా కొనియాడింది. ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని కేరళలోని నిలంబూర్‌లో అవార్డును ముఖ్యమంత్రి - మిగతా 2 లో

## ఎమ్మెల్యేగా దానం అనర్హుడే



2 లో..

- పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు
- హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది
- ఆయనపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది
- సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు.



## పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు
- మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్ లపై పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది
- తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేశారంటూ హరీశ్ మండిపాటు
- ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిందలు వేస్తున్నారని విమర్శ

**హైదరాబాద్ :** తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో - మిగతా 2 లో

## కోటీశ్వరులతో కిక్కిరిసిపోతున్న చంచల్‌గూడ జైలు!

- ఏసీబీకి చిక్కుతున్న వందల కోట్ల అవినీతి తిమింగలాలు
- ఇటీవల నిమ్స్ అధికారి సహా పలువురు అరెస్ట్
- లంచం, అక్రమాస్తుల కేసుల్లో పెరుగుతున్న అరెస్టులు

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు ఇప్పుడు 'కోటీశ్వరుల జైలు'గా మారిపోయింది. వందల కోట్ల రూపాయల అక్రమాస్తులు కూడబెట్టి, అవినీతికి పాల్పడి ఏసీబీకి పట్టుబడుతున్న బడా అధికారులు ఇప్పుడు ఈ జైలుకే చేరుతున్నారు. దీంతో ఒకప్పుడు సాధారణ ఖైదీలతో ఉండే - మిగతా 2 లో







## అంటార్కిటికాలో మంచు గణపతి

- భారత శాస్త్రవేత్తల వినూత్న చవితి వేడుక
- మైత్రి పరిశోధన కేంద్రంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు
- పర్యావరణ హితంగా బకెట్ నీటిలో విగ్రహ నిమజ్జనం
- ఈ వేడుకలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- కఠిన పరిస్థితుల్లోనూ సంప్రదాయాన్ని పాటించిన శాస్త్రవేత్తలపై ప్రశంసలు

**ఢిల్లీ :** స్వదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో, అత్యంత శీతల ఖండమైన అంటార్కిటికాలో భారత శాస్త్రవేత్తలు వినాయక చవితి పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో, వినూత్నంగా జరుపుకున్నారు. అక్కడి భారత పరిశోధన కేంద్రమైన 'మైత్రి'లో పనిచేస్తున్న శాస్త్రవేత్తల బృందం, మంచుతోనే గణనాథుడి విగ్రహాన్ని స్వయంగా తయారు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి తమ సంప్రదాయంపట్ల ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. - మిగతా 2 లో

## సూపర్ ఎల్‌నినోతో భారీ ముప్పు



- 4.51 లక్షల మంది చనిపోయే అవకాశం- భారత్‌పై ప్రభావమెంత
- సాధారణం కంటే 44 శాతం ఎక్కువ వేడి ఉండే రోజులు
- భారత్‌లో ఫిబ్రవరి వరకు 15,800 అదనపు మరణాల అంచనా
- ఎల్‌నినో కొనసాగితే భారత్‌లో వేసవిలో ముప్పు మరింత పెరిగే అవకాశం

**ఢిల్లీ :** ప్రపంచానికి మరో పెద్ద ముప్పు పొంచి ఉందా ఈ ఏడాది బలంగా మారిన సూపర్ ఎల్‌నినోపై తాజా నివేదిక అదే భయాన్ని కలిగిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో వచ్చే కొన్ని నెలల్లో ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఎండలు పెరగొచ్చని, దీంతో వేడి తట్టుకోలేక లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ తెలిపింది. ఈ ఏడాది జూన్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా 4.51 లక్షల మంది వేడి కారణంగా చనిపోయే అవకాశం ఉందని ఈ నివేదిక చెబుతోంది. అయితే ఇది కచ్చితమైన సంఖ్య కాదని, వాతావరణ పరిస్థితులు మారితే ఆ సంఖ్య కూడా మారొచ్చని పరిశోధకులు - మిగతా 2 లో



2 లో..

## వరంగల్ విమానాశ్రయానికి 'రాణి రుద్రమ' ఆదిలాబాద్‌కు 'కొమరం భీం' పేర్లు!

## కుండపోత వర్షాలు అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

- కాకినాడ జిల్లాలో భారీ వర్షాలపై కలెక్టర్‌తో ఫోన్‌లో సమీక్షించిన పవన్ కల్యాణ్
- వర్షాలు తగ్గే వరకు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశం
- జిల్లాలో 1,885 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- నష్టపోయిన వారికి తక్షణం పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచన



**అమరావతి :** తీవ్ర వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో, అధికార యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, - మిగతా 2 లో



## అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

- స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు
- స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిగా సిద్ధం కావాలన్న జగన్
- ఎన్నికలపై పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం
- ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని ఆదేశం

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన రాబోయే ఎన్నికల కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నేతలకు దిశానిర్దేశం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ - మిగతా 2 లో

## ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట



- ఏపీలో పెట్టుబడుల కోసం ఢిల్లీలో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం ఏర్పాటుకు యారాకు ఆహ్వానం
- విశాఖలో టెక్నాలజీ, ఇంజనీరింగ్ సెంటర్ల ఏర్పాటుకు సిస్కో, శాప్‌లకు విజ్ఞప్తి
- తిరుపతిలో ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయాలని వివోకు సూచన
- వైద్య పరికరాలు, ఆగ్రో కెమికల్ యూనిట్ల ఏర్పాటుకు అబాట్, గోద్రెజ్‌లకు ప్రతిపాదనలు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. - మిగతా 2 లో

## ఏపీలో వర్ష బీభత్సం యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశం
- భారీ వర్షాలపై జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు
- వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మరోసారి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు
- వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సీఎం చంద్రబాబు మరోసారి టెలీకాన్ఫరెన్స్



**అమరావతి :** భారీ వర్షాలపై జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మరోసారి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎం క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. నీటి ఉద్ధృతితో దెబ్బతిన్న రహదారులను తక్షణమే పునరుద్ధరించాలని, కొండచరియలు విరిగిపడే ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతో పాటు కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. చెరువులు నింపడంతో పాటు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వరద పరిస్థితులను నిరంతరం అంచనా వేస్తూ ప్రజలకు అవసరమైన సహాయం వెంటనే అందించాలని సీఎం స్పష్టం చేశారు.వర్షాలతో వస్తున్న ప్రతి నీటి ప్రవాహాన్ని ఒడిసిపట్టి రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులు, ఇతర నీటి వనరులను నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సాయంత్రం - మిగతా 2 లో

# సంపాదకీయం

## అజేయుడు పుతిన్!

ఎన్నికల బాదరబందీ లేకుండా, ఓటర్ల చుట్టూ ప్రదక్షిణ చేసే 'ఖర్మ' పట్టకుండా దేశాధినేతలుగా చలామణి అయ్యేవారు ప్రపంచంలో ఇప్పటికీ చాలామందే ఉన్నారు. ఆ దేశాల్లో ఇలాంటివారికి మీడియా, సామాజిక మాధ్యమాలూ భజన చేస్తున్నా... ప్రపంచంలో వేరేచోట్ల వారికి నియంతలన్న అపకీర్తి ఉంటుంది. చైనా, ఉత్తర కొరియా వంటి దేశాల్లో మార్క్సిజం పేరు చెప్పి ఈ ఏకపక్ష స్వామ్యం సాగిపోతుంటుంది. రష్యాను దీర్ఘకాలంనుంచి ఏలుతున్న అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సాధించిన అఖండ విజయం మరోసారి ఆయనదైన ముద్ర చూపింది. తన పదవికి ఎసరుపెట్టే అవకాశం ఉందని భావించిన వారెవరినీ ఆయన వదల్లేదు. ఏమాత్రం ప్రభావితం చేయలేనివారు పోటీలో ఉన్నా పట్టించుకోలేదు. ఆయన వ్యతిరేకులు అనుమానాస్పద స్థితిలో మరణించ టమో, జైళ్లకు పోవటమో రివాజు. ఈనెల 18 నుంచి 20 వరకూ రష్యా పార్లమెంటు డ్యూమాకు జరిగిన ఎన్నికల్లో ఆయనకే చెందిన 'యునైటెడ్ రష్యా' పోలైన ఓట్లలో 57.83 శాతం దక్కించుకుంది. 2021లోని 49.82 శాతంతో పోలిస్తే ఇది అధికం. 95 శాతం ఓట్ల లెక్కింపు జరిగాక బుధవారం ఎన్నికల సంఘం ప్రకటించిన ప్రాథమిక ఫలితాలనుబట్టి దానికి 355 స్థానాలు వచ్చాయి. గత ఎన్నికల్లో ఆ పార్టీ బలం 343. ఒకప్పుడు అవిచ్ఛిన్నంగా దేశాన్నేలిన వారసత్వంగల కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్ పార్టీకి 13.8 శాతం ఓట్లు, దాదాపు 40 స్థానాలు లభిస్తాయని తేలింది. 2021లో ఆ పార్టీకి 18.93 శాతం ఓట్లు, 57 సీట్లు లభించాయి. ఉక్రెయిన్ యుద్ధాన్ని వ్యతిరేకించిన ఏకైక పార్టీ యాబ్లొకా పార్టీపై అనర్హత వేటుపడింది. ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించి నాలుగున్నరేళ్లు దాటడం, ఆంక్షల పర్యవసానంగా దేశ ఆర్థికవ్యవస్థ కుంగిపోవటం, ధరలు ఆకాశాన్నంటడం, ప్రత్యర్థి దేశం డ్రోన్ దాడుల పరంపరతో చమురు క్షేత్రాలు ధ్వంసం కావటంతో జనం యునైటెడ్ రష్యాను వ్యతిరేకించటం ఖాయమని కొందరు అంచనా వేశారు. రష్యా ఎదుర్కొంటున్న సంక్షోభం సామాన్యమైనది కాదు. చమురు క్షేత్రాల ధ్వంసంవల్ల ఉత్పత్తి నిలిచి, పెట్రోల్ బంకుల వద్ద వేలాది వాహనాలు బారులు తీరాయి. చివరకు తాను విక్రయించిన చమురునే మళ్లీ భారత్‌నుంచి కొనుగోలు చేయకతప్పలేదు. రష్యాలో సంక్షోభం ఏ స్థాయిలో ఉందంటే, మరిన్ని 'త్యాగాలకు' సిద్ధపడాలని కొత్త ప్రభుత్వం పౌరుల్ని కోరవచ్చంటు న్నారు. ఆరోగ్య పరిరక్షణ, విద్య వగైరా వ్యయాలను కట్టిపెట్టి యుద్ధంపైనే సర్వశక్తులూ కేంద్రీకరించాలని పుతిన్ చాన్నాళ్లుగా భావిస్తున్నారు. 'యుద్ధ ఆర్థిక వ్యవస్థ'లో సర్వం లయంకావటం సహజమే. ఎన్నికల ప్రక్రియను ఏమార్చటం రష్యాలో సాధారణమే అయినా, ఓట్లేసినవారిలో అత్యధికులు దేశభక్తి, జాతీయత వంటి వ్యామోహాల్లో పడ్డారని కొందరి వాదన. తనకు దేశంపై పూర్తి స్థాయి పట్టు ఉందని ఎన్నికలైనా, వ్యవస్థలైనా విశ్వసనీయమైనవని చూపటానికి పుతిన్ తాపత్రయ పడ్డారు. 'త్యాగాలకు' సిద్ధపడాలని పిలుపునిచ్చే ఆర్థిక దుఃస్థితి లేనేలేదని, ఇదంతా గిట్టనివాళ్ల ప్రచారమని ఎన్నికలకు ముందు ఆయన ప్రకటించారు. కానీ ఇచ్చిన మాట నిలుపుకుంటారా అన్నది చెప్పలేం. ఈ ఎన్నికలు బూటకమని, వీటిని తిరస్కరించాలని బ్రిటన్, కెనడా, నార్వే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. అయితే సార్వజనీనంగా ఆమోదించిన ప్రజాస్వామ్య నమూనా అంటూ ప్రపంచంలో ఎక్కడా లేదు. ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నదని చెప్పుకుంటున్న దేశాలు ఆ పదానికి తమ తమ సొంత భాష్యాలు ఇచ్చుకుంటున్నాయి. క్రమం తప్పని ఎన్నికలు, నిర్ణీత వ్యవధిలో చట్టసభల సమావేశాలు, వాటిల్లో అధికార విపక్షాల వాగ్యుద్ధాలు, పరస్పర ఆరోపణలు.

## అభ్యర్థుల ఎంపికపై జగన్ కీలక సూచనలు

**మొదటిపేజీ తరువాయి -** చేయడానికి వీలైనంత త్వరగా ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఏకపక్షంగా కాకుండా పార్టీలోని ప్రతి ఒక్కరి అభిప్రాయాలను సేకరించి, పలు దఫాలుగా విస్తృత చర్చలు జరిపిన తర్వాతే తుది జాబితాను ఖరారు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఎంపిక చేసే అభ్యర్థులు రాబోయే సాధారణ ఎన్నికలకు బలమైన పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల ప్రజలకు జరుగుతున్న కష్టాలు, మోసాలను ప్రతి గడప వద్దకూ వెళ్లి వివరించాలని కేడర్‌కు సూచించారు. వైసీపీ హయాంలో అందించిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేస్తూనే, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు ప్రభుత్వం అధికార బలంతో పాటు పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తూ అనేక అడ్డదారులు తొక్కుతుందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఎలాంటి కుట్రలు ఎదురైనా తట్టుకునేలా పార్టీ శ్రేణులు ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, రీజినల్ కో-ఆర్డినేటర్లు ప్రత్యామ్నాయ ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## కోటీశ్వరులతో కిక్కిరిసిపోతున్న చంచల్‌గూడ జైలు!

**మొదటిపేజీ తరువాయి -** ఈ జైలు, ఇప్పుడు కోట్ల రూపాయల ఆస్తులున్న వారితో నిండిపోతోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తాజాగా, నిమ్స్ అదనపు సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ ఆదాయానికి మించి రూ.100 కోట్ల ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై అరెస్ట్ అయి చంచల్‌గూడ జైలుకు చేరారు. కొన్ని రోజుల క్రితమే డీఎస్పీ భీంరెడ్డి కూడా వంద కోట్లకు పైగా అక్రమాస్తుల కేసులో ఏసీబీకి చిక్కి ఇక్కడికే వచ్చారు. వీరే కాకుండా, ల్యాండ్ అండ్ సర్వే విభాగం డిప్యూటీ డైరెక్టర్ నరహరిరావు సైతం రూ.100 కోట్లకు పైగా ఆస్తుల కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్నారు. ఇలా పోలీసు, రెవెన్యూ, వైద్య, ఇంజనీరింగ్ వంటి పలు శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఏసీబీ వలలో చిక్కి చంచల్‌గూడ జైలుకు చేరుతున్నారు. అవినీతి కేసుల్లో ప్రధానంగా రెండు రకాలుగా అధికారులు పట్టుబడుతున్నారు. ఒకటి, చేయాల్సిన పనికి నేరుగా లంచం డిమాండ్ చేయడం. రెండోది, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టడం. ఈ రెండు కేసుల్లోనూ పక్కా ఆధారాలతో ఏసీబీ అధికారులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. ఓ విచిత్రమైన ఘటనలో, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సబ్-జైలులో డిప్యూటీ జైలర్‌గా పనిచేసిన దేవేందర్, ఓ ఖైదీ నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. గంటల వ్యవధిలోనే.. అధికారిగా పనిచేసిన అదే జైలులో ఆయన ఖైదీగా మారాల్సి వచ్చింది. ఒకప్పుడు అధికారం, విలాసవంతమైన జీవితం గడిపిన ఈ అధికారులు.. ఇప్పుడు జైలు గోడల మధ్య విచారణ ఖైదీలుగా కాలం గడుపుతున్నారు.

## వరంగల్ విమానాశ్రయానికి 'రాణి రుద్రమ' ఆదిలాబాద్‌కు 'కొమరం భీం' పేర్లు!

**మొదటిపేజీ తరువాయి -** వరంగల్‌లోని మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం పేర్లు ఖరారు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టుకు కాకతీయ రాణి రుద్రమదేవి పేరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆదివాసీ యోధుడు కొమురం భీం పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు ఫైలును కేబినెట్ సమావేశం ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ పేర్లపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త విమానాశ్రయాలకు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెట్టిన తరహాలోనే, తెలంగాణ చారిత్రక వైభవాన్ని, వీరుల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ ఆమోదం పొందిన వెంటనే, ఈ పేర్లను ఖరారు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ పంపనున్నారు. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అయితే, మామునూరు ఎయిర్‌పోర్టుకు సమ్మక్క-సారలమ్మ పేరు కూడా పరిశీలనలో ఉందని, దీనిపై త్వరలోనే స్పష్టత రానుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

## కుండపోత వర్షాలు అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

**మొదటిపేజీ తరువాయి -** పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఆయన జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి సమీక్ష నిర్వహించారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, జలాశయాల్లో నీటి మట్టాలు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంట నష్టం, మత్స్యకారుల భద్రత వంటి పలు కీలక అంశాలపై పవన్ కల్యాణ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా సగటున 117.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 15 ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలగా వాటిని తక్షణం తొలగించామని కలెక్టర్ వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 1,885 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని 24 గంటలూ సమీక్షిస్తున్నామని, ప్రస్తుతం అంతా అదుపులోనే ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వరద ముప్పు, సహాయక చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. "జిల్లాలో ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలపై నిరంతరం దృష్టి సారించాలి. అవసరమైన చోట తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి'' అని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకం కలగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా పంపుల సహాయంతో ఎప్పటికప్పుడు డీ-వాటరింగ్ చేయాలని ఆదేశించారు. ఈదురు గాలులకు కూలిన చెట్లను వెంటనే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఏలేరు, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్ జలాశయాల్లో నీటి మట్టాలను నిరంతరం గమనిస్తూ, అవసరమైతే దిగువ ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించాలని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయాలని, ఆ నివేదికను ప్రభుత్వానికి పంపి రైతులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఆస్తి నష్టం జరిగిన బాధితులకు కూడా తక్షణ సహాయం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు.

# ఏపీలో వర్ష బీభత్సం యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

**మొదటిపేజీ తరువాయి -** ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం వర్షాలు, నీటి ప్రవాహాలపై సమీక్ష నిర్వహించారు. అవసరమైన చోట మొబైల్ లిఫ్ట్‌లు, మోటార్లను వినియోగించి నీటిని ఎత్తిపోసి నిల్వ చేయాలని స్పష్టం చేశారు. గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లలో పెరుగుతున్న ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రకృతి వ్యవసాయం, భూసార పెంపు, ఏఐ ఆధారిత డేటా విశ్లేషణను పైలట్‌గా అమలు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాలు దృష్ట్యా వరద నియంత్రణ చర్యల్లో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహి ంచిన మంత్రి, వాతావరణ శాఖ నుంచి ముందస్తు సమా చారం తీసుకుంటూ రిజర్వాయర్లు, నదులు, వాగుల్లోకి వచ్చే నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని సూచించారు. మున్నేరు ఇన్‌ఫ్లో, బుడమేరు వరద పరిస్థితిని బట్టి పట్టిసీమ పంపులను, ఏలేరు క్యాచ్‌మెంట్‌లో వర్షాలకు అనుగుణంగా పురుషోత్తపట్నం పంపులను ఆపరేట్ చేయాలని ఆదేశించారు. వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ నదుల ప్రవాహా లను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇరిగేషన్ అధికారులు వార్‌రూమ్‌ల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి నిమ్మల ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి వర్షాల పరిస్థితిని సమీక్షించారు. లోతట్టు ప్రాం తాల్లో నీరు నిలవకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు ఇంజినీరింగ్, పారిశుద్ధ్య సిబ్బంది 24 గంటలూ అందు బాటులో ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. డ్రెయిన్లలో సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలని, రోడ్లపై విరిగిపడే చెట్లను వెంటనే తొలగించేందుకు అవసరమైన యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలపై తక్షణమే స్పందిం చాలని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. విశాఖ జిల్లాలో వర్షాల పరిస్థితిపై మంత్రి వీరాంజనేయస్వామి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుత పరిస్థితి, ముంపు ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యలపై అధికారులను అడిగి తెలుసు కున్నారు. ముంపు కాలనీల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సహాయక చర్యలు చేపడుతున్న అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. వర్షాలు తగ్గే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి డోలా భరోసా ఇచ్చారు. వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తు న్నందున ఆర్అండ్‌బీ శాఖ అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 613 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రహదారులు దెబ్బతిన్నాయని వెల్లడించారు. అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాలో 356 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నట్లు మంత్రి తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రహదారులకు అధిక నష్టం వాటిల్లిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు చోట్ల భారీ కోతలు ఏర్పడి రహదారులు కొట్టుకుపోగా, 78 చోట్ల సీడీ వర్క్‌లు దెబ్బతిన్నాయని, 37 చోట్ల పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు వివరిం చారు. 11 చోట్ల రహదారులపై పడిన చెట్లను తొలగించి రాకపోక లను పునరుద్ధరిం చామన్నారు. 23 చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే 14 చోట్ల క్లియర్ చేశామని తెలిపారు. దెబ్బతిన్న రహదా రుల తాత్కాలిక పునరుద్ధరణకు రూ.26.95 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.224.73 కోట్లు అవసరమవుతాయని, మొత్తంగా రూ. 251.68 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. రాష్ట్రవ్యా ప్తంగా 78 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమిం చామని, 614 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని మంత్రి తెలిపారు. రోడ్లపై పడే చెట్లు, మట్టి, కొండచరి యలను తొలగించేం దుకు 550 జేసీబీలు, 596 పవర్ సాస్‌ను సిద్ధంగా ఉంచామని, అత్యవసర సహాయక చర్యలకు సిబ్బ ంది, అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు బీసీ జనార్దన్ రెడ్డి వివరిం చారు. తుఫాను ప్రభావంతో గుంటూరు జిల్లా మంగళగిరిలో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుంది. రహదా రులపై మోకాల్లోతు నీరు నిలిచింది. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కొండ ప్రాంతంలో ఉంటున్న వారిని అప్రమత్తం చేయాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశిం చారు. దీంతో గండాలయ్యపేట, ఇతర కొండ ప్రాంతాలలో ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఇంటింటా మైకుల ద్వారా హెచ్చరిస్తున్నారు.

# ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా వారిని ఆహ్వానిస్తున్నారు. పర్యటనలో భాగంగా, నార్వేకు చెందిన ప్రముఖ ఎరువులు, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ వైశాలి చోప్రాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడలో గ్రీన్-అమ్మోనియా తయారీ, ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచిం చారు. అంతేకాకుండా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంట-పోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. దీనిపై వైశాలి చోప్రా స్పందిస్తూ, యారా ఇండియా ఇప్పటికే 17 రాష్ట్రాల్లో 1500 అవుట్‌లెట్ల ద్వారా 5.5 మిలియన్ల రైతులకు డిజిటల్‌గా సేవలు అందిస్తోందని తెలిపారు. యూపీలోని బాబ్రాలా కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. గ్లోబల్ పేమెంట్స్ టెక్నాలజీ దిగ్గజం మాస్టర్‌కార్డ్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ లేదా టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్టార్టప్‌లను ప్రోత్సహి ంచేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఫిన్‌టెక్ సలహాదారుగా చేరాలని ఆహ్వానించారు. ఇప్పటికే రాజమండ్రి, కోనసీమలో మాస్టర్‌కార్డ్ అమలు చేస్తున్న 'ప్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్' కార్యక్రమాన్ని ఇతర పర్యాటక ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. దీనికి అభిషేక్ లాహిరి స్పందిస్తూ, భారత్‌లో పూణేలో తమకు అతిపెద్ద టెక్ హబ్ ఉందని, ఏపీ టూరిజం అథారిటీతో ఇప్పటికే ఎంఓయూ ఉందని గుర్తుచేశారు. తాజా ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు. గ్లోబల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం సిస్కో సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ కృష్ణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమ య్యారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల డిమాండ్‌కు అనుగుణంగా సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో ఒక ఇంజినీరింగ్ సెంటర్ లేదా జీసీసీని ఏర్పాటు చేయాలని కోరారు. హరీశ్ కృష్ణన్ స్పందిస్తూ, ఏపీ ప్రభుత్వంతో తమకు ఇప్పటికే బలమైన అనుబంధం ఉందని గుర్తుచేశారు. 50 వేల మంది యువతకు నైపుణ్య శిక్షణ, విశాఖలో ఇన్నోవేషన్ సెంటర్, తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం వహించామని తెలిపారు. చెన్నైలోని తయారీ ప్లాంట్ ద్వారా 1 బిలియన్ డాలర్ల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని చెప్పారు.

# సూపర్ ఎల్‌నినోతో భారీ ముప్పు

**మొదటిపేజీ తరువాయి -** తెలిపారు. 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు ఆరు నెలల్లో వేడి వల్ల ప్రపంచవ్యాప్తంగా సుమారు 2.39 లక్షల మంది మరణించే అవకాశం ఉందని క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక అంచనా వేసింది. ఎల్‌నినో ప్రభావం వచ్చే ఏడాది వేసవి వరకు కొనసాగితే ఆ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. సాధారణ సంవత్సరాలతో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేడి ఉండే రోజులు 44 శాతం పెరగొచ్చని తెలిపింది. అంటే ఎండలు ఎక్కువ రోజులు మాత్రమే కాకుండా, మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నమాట. ఆ వేడి ప్రభావం భారత్‌పైనా పడే అవకాశం ఉంది. సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు దేశంలో సుమారు 15,800 మరణాలు సంభవించే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. ఇందులో డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యే సుమారు 7,400 మంది వేడి కారణంగా ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని పేర్కొంది. అయితే భారత్‌లో అసలు ఎండాకాలం మార్చి తర్వాత మొదలవుతుంది. ఆ సమయంలో కూడా ఎల్‌నినో ప్రభావం కొనసాగితే వేడి వల్ల మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. వేడి కారణంగా ఎక్కువ మరణాలు సంభవించే అవకాశం ఉన్న దేశాల్లో నైజీరియా మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత ఇండోనేసియా, సూడాన్, భారత్, బ్రెజిల్ ఉన్నాయి. నైజీరియా- 31,400 వరకు, ఇండోనేసియా- 19,300 వరకు, సూడాన్- 17,500 వరకు, భారత్- 15,800 వరకు, బ్రెజిల్- 13,300 వరకు ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉండొచ్చని నివేదిక తెలిపింది. నైజీరియా, సూడాన్, నైజర్, చాద్ ప్రాంతాల్లో కలిపి సుమారు 66,800 అదనపు మరణాలు సంభవించే అవకాశం ఉందని అంచనా వేసింది. సాధారణంగా పసిఫిక్ సముద్రంలో నీటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగినప్పుడు ఎల్‌నినో ఏర్పడుతుంది. దీనివల్ల ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు మారిపోతాయి. ఎక్కడో వర్షాలు తగ్గుతాయి. మరికొన్ని చోట్ల భారీ వర్షాలు పడొచ్చు. కొన్ని ప్రాంతాల్లో ఎండలు కూడా తీవ్రంగా మారుతాయి. సముద్రం నీటి ఉష్ణోగ్రత సాధారణం కంటే చాలా ఎక్కువగా పెరిగినప్పుడు దాన్ని సూపర్ ఎల్‌నినో అంటారు. ప్రస్తుత ఎల్‌నినో చాలా బలంగా ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ఎల్‌నినో సహజంగా ఏర్పడే వాతావరణ మార్పే అయినప్పటికీ, భూమి ఇప్పటికే వేడెక్కుతుండటం వల్ల దాని ప్రభావం మరింత ఎక్కువగా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. భూమి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న సమయంలో ఎల్‌నినో కూడా తోడైతే కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన ఎండలు, వర్షాభావం, అడవుల్లో మంటలు, భారీ వర్షాలు, వరదలు వంటి సమస్యలు పెరగొచ్చని హెచ్చరిస్తున్నారు. ప్రజలకు ముందుగానే ఎండలపై హెచ్చరికలు ఇవ్వడం, చల్లగా ఉండే కేంద్రాలను ఏర్పాటు చేయడం, తాగునీరు అందుబాటులో ఉంచడం వంటి చర్యలు ఉపయోగప డతాయని పేర్కొంది. ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, చిన్నపిల్లలు, ఎండలో పనిచేసే కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించింది. వేడి ఎక్కువగా ఉండే రోజుల్లో ఆసుపత్రుల్లో అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచడం కూడా అవసరమని తెలిపింది. ప్రస్తుత పరిశోధకులు భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణానికి ఒక ముందస్తు హెచ్చరికగా చెప్పింది. ఎండలు మరింత తీవ్రంగా మారే పరిస్థితుల్లో ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవడం వల్ల భారీ ప్రాణనష్టాన్ని తగ్గించే అవకాశం ఉందని నివేదిక స్పష్టం చేసింది.

## అంటార్కిటికాలో మంచు గణపతి

**మొదటిపేజీ తరువాయి -** ఈ అపురూప వేడుక ఇప్పుడు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చ్'కు చెందిన ఈ పరిశోధకులు, గడ్డకట్టే చలిలో తమకు అందుబాటులో ఉన్న మంచును ఉపయోగించి ఒక సుందరమైన గణపతి రూపాన్ని తీర్చిదిద్దారు. ఎలాంటి అచ్చులు లేకుండా, కేవలం చేతులతోనే ఈ విగ్రహాన్ని రూపొందించడం వారి సృజనాత్మకతకు, భక్తికి నిదర్శనంగా నిలిచింది. అనంతరం హిందూ సంప్రదాయం ప్రకారం విగ్రహానికి హారతి ఇచ్చి, పూజలు చేశారు. నైవేద్యంగా మోదకాలు వంటి ప్రసాదాలను సమర్పించి పండుగ వాతావ రణాన్ని సృష్టించారు. ఈ వేడుకలో అత్యంత ప్రత్యేకమైన ఘట్టం నిమజ్జనం. అంటార్కిటికాలోని సున్నిత మైన, కాలుష్యరహిత పర్యావరణానికి ఎలాంటి హాని కలగకూడదనే గొప్ప ఉద్దేశంతో వారు పర్యావరణ హితమైన పద్ధతిని ఎంచుకున్నారు. బయట సహజ నీటి వనరులలో కాకుండా, పరిశోధన కేంద్రం లోపలే ఒక బకెట్‌లో నీటిని తీసుకుని, అందులో మంచు గణపతి విగ్రహాన్ని ఉంచారు. కొద్దిసేపటికే మంచు పూర్తిగా కరిగి విగ్రహం నీటిలో కలిసిపోయింది. ఈ విధంగా వారు పర్యావరణ నిబంధనలను పాటిస్తూనే తమ సాంప్రదాయాన్ని పూర్తిచేశారు. ఈ బృందంలోని డాక్టర్ అనిరుధ్ ధర్, ఈ అపురూప వేడుకలకు సంబంధించిన వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. "మా ఇంటికి 15,000 కిలోమీటర్ల దూరంలో, సుస్థిరమైన పద్ధతిలో నిమజ్జనం" అంటూ ఆయన తన పోస్టుకు క్యాప్షన్ జోడించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అయింది. అత్యంత కఠినమైన వాతావరణ పరిస్థితుల్లోనూ, తమ సంస్కృతిని మరువకుండా ఇంత సృజనాత్మకంగా, భక్తితో పండుగ జరుపుకున్న శాస్త్రవేత్తల బృందంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. వారి దేశభక్తిని, పర్యావరణ స్పృహను కొనియాడుతున్నారు.

## సీఎం రేవంత్‌కు 'ముహమ్మద్' అవార్డు ప్రదానం

**మొదటిపేజీ తరువాయి -** రేవంత్ రెడ్డికి ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేస్తారు. ముహమ్మద్ కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత. ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా, కేరళలోని వివిధ మంత్రివర్గాల్లో నాలుగుసార్లు వివిధ శాఖలకు మంత్రిగా సేవలు అందించారు. రాజనీతిజ్ఞుడైన ముహమ్మద్ దూరదృష్టి గల నేతగా, అద్భుతమైన పార్లమెంటేరియన్‌గా, సమర్థుడైన పాలకునిగా, కార్మికవర్గ ఛాంపియన్‌గా కేరళ ప్రజల మదిలో నిలిచిపోయారు. నిజాయతీ, లౌకిక విలువలు, ప్రజా సంక్షేమ పాలనకు మారుపేరుగా ముహమ్మద్ నిలిచారు.

## పరువునష్టం పిటిషన్లను కోర్టు స్వీకరించింది

**మొదటిపేజీ తరువాయి -** క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో సెప్టెంబర్ 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే తమపై ఈ తరహా నీచమైన నిందలు వేస్తున్నారని హరీశ్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇన్నాళ్లైనా అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం దారుణమని అన్నారు. సభా హక్కుల ఉల్లంఘన నోటీసులను కూడా స్పీకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటివని అభివర్ణించారు. లోక్‌సభలో రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడే రాహుల్ గాంధీ, తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలతో తక్షణమే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు స్పీకర్ ప్రయత్నించారని, అయితే పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు తప్పదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఫిరాయింపు నేతలు రాజీనామాలు చేసి ప్రజా తీర్పును కోరాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## 'ఎమ్మెల్యేగా దానం అనర్హుడే'

**మొదటిపేజీ తరువాయి -** దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఆయన ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించిన హైకోర్టు తీర్పును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీ తరఫున పోటీ



చేయడాన్ని తప్పుపట్టిన సుప్రీంకోర్టు, దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఏమీ లేదని, ఘర్ వాపసీ చట్ట సభలకు వర్తించదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఆయారాం, గయారాంలు పెరుగుతు న్నారని వ్యాఖ్యానించింది. అటు సుప్రీంకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఒక పార్టీ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్‌లో దానం నాగేందర్ పేర్కొన్నారు. దానిని ప్రాతిపదికగా తీసుకొని తెలంగాణ హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. గతంలో ఈ విధంగా వేరే పార్టీ నుంచి పోటీ చేశారన్న కారణంతో బిహార్ రాష్ట్రానికి చెందిన మహాచంద్రప్రసాద్ అనే వ్యక్తిని సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిందన్న ఏకైక కారణాన్ని ప్రాతిపదికగా తీసుకొని శాసన సభాపతి ఆదేశాలను హైకోర్టు కొట్టేయడం పొరపాటు అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని దానం నాగేందర్ అన్నారు. ఉపఎన్నికల్లో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారన్నారు. "సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా. గతంలో మూడు సార్లు గెలిచాను. నాకు ప్రజా క్షేత్రంలో బలం ఉంది కలిసి పని చేస్తాం తప్పకుండా గెలుస్తాం. పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయా లంటూ బీఆర్ఎస్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. విచారణ చేపట్టిన సభాపతి ఈ పిటిషన్‌లను కొట్టివేశారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ ఇటీవల తీర్పును వెలువరించింది. బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థిగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసినందున రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తున్నట్లు పేర్కొంది. దానంపై అనర్హత నేపథ్యంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఈ ఉత్తర్వుల ప్రతిని స్పీకర్ కార్యదర్శికి, ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది. బీఆర్ఎస్ సభ్యుడిగా ఉంటూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసినందున స్వచ్ఛందంగా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని వదులుకున్నట్లేనని, కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం అన్నది పదో షెడ్యూల్ ప్రకారం బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడం అవుతుందా లేదా అన్నదానిపై స్పీకర్ సమాధానమిచ్చారని హైకోర్టు తెలిపింది. శాసనసభ్యుడిగా ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగపరంగా నిషేధించలేదని, ఒకవేళ మరో పార్టీ టిక్కెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని పార్టీ ఫిరాయింపుగా పరిగణించాల్సి వస్తే రాజ్యాంగం దాన్ని స్పష్టంగా పేర్కొని ఉండేదని, అలా నిర్దేశించనపుడు రాజ్యాంగ అనర్హతను నిర్ధారించలేమని స్పీకర్ పేర్కొన్నట్లు హైకోర్టు వివరించింది.

# కొత్తపల్లె లో ఘనంగా పోషణ అభియాన్ మహోత్సవం

**గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి**





**వెల్గటూర్ సెప్టెంబర్ 24 (ప్రజా మంటలు):** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ధర్మపురి ప్రాజెక్టు ఆధ్వర్యంలో వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామ అనుబంధ గ్రామం అయిన కొత్తపల్లె లో పోషణ అభియాన్ మహోత్సవాన్ని గురువారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐ సి డి ఎస్ సీడీపీవో వాణిశ్రీ అధ్యక్షత వహించగా, సూపర్‌వైజర్లు ఆండాలు, అంగన్వాడి టీచర్ చెన్న జ్యోతి, ఆశా వర్కర్ మానుపటి గీత ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పోషణ మాసం, పోషణ అభియాన్‌లో భాగంగా పౌష్టిక విలువలు కలిగిన వివిధ రకాల వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల పిల్లల ఎదుగుదలకు బాలామృతం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఆరు నెలలు నిండిన ప్రతి చిన్నారికి ప్రతిరోజూ బాలామృతాన్ని తప్పనిసరిగా అందించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలకు శ్రీమంతాల కార్యక్రమం చేపట్టారు. జాతీయ పోషణ అభియాన్‌లో భాగంగా అధికారులు, సిబ్బంది, మహిళలు, తల్లులు, గ్రామస్తులతో పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సిడిపిఓ వాణిశ్రీ గారు సూపర్వైజర్ ఆండాలు, అంగన్వాడీ టీచర్ చెన్న జ్యోతి,ఆశావర్కర్ మానుపటి గీత గర్భిణీ స్త్రీలు బాలింతలు తల్లులు గ్రామస్తులు హాజరయ్యారు.

## రైతును రిజిస్ట్రేషన్ చేసి రైతుగా గుర్తించడమెందుకు?

**పంట పండించడం ఒక పరీక్ష.. అమ్ముకోవడం మరో పరీక్ష: దావ వసంత సురేష్**



**సారంగాపూర్, సెప్టెంబర్ 24 (ప్రజా మంటలు):** రైతు పంట పండించడమే కాకుండా, దానిని అమ్ముకోవడానికి కూడా ప్రభుత్వ నిబంధనలతో ఇబ్బందులు పడుతున్నారని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. రేచపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, సమయానికి నీరు, విద్యుత్ అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్, యాప్‌ల పేరుతో రైతులపై అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు. రైతు పండించిన పంటను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాలకు సంబంధించిన ఆరు పంటల బోనస్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఫసల్ బీమా యోజన అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తేలు రాజు, మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


## జగిత్యాలలో ఈదురుగాలులకు కారుపై విరిగిపడిన వేప చెట్టు



**జగిత్యాల, సెప్టెంబర్ 24 (ప్రజా మంటలు):** పట్టణంలో వీచిన ఈదురుగాలులకు 6వ వార్డు గోవిందుపల్లెలో నిలిపి ఉంచిన మారుతి బలెనో కారుపై వేప చెట్టు విరిగిపడింది. ఈ కారు కొత్తపేట నాగలయం ఈఓ విక్రమ్‌కు చెందినదిగా తెలిసింది. చెట్టు విరిగిపడటంతో కారు ధ్వంసమైంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## అధునాతన వైద్య సౌకర్యాలతో గచ్చిబౌలిలో బటర్ ఫ్లై హాస్పిటల్స్ ప్రారంభం..

**-మహిళలు, శిశు సంరక్షణే లక్ష్యం**




**సికింద్రాబాద్, సెప్టెంబర్ 24 (ప్రజా మంటలు):** మహిళలు, చిన్నారులకు అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు గచ్చిబౌలిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'బటర్‌ఫ్లై హాస్పిటల్స్' శాఖను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు హర్కారా వేణుగోపాల్ రావు, సినీనటి మంజుల ఘట్టమనేని, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మహిళలు, పిల్లలకు సంబంధించిన ప్రసూతి, గైనకాలజీ, పీడియాట్రిక్స్ వంటి అన్ని రకాల వైద్య విభాగాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి నాణ్యమైన చికిత్సను అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యమని ఆసుపత్రి ఎండీ డాక్టర్ వసంత్ కుమార్ చకిలం తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా గర్భిణులు, మహిళలు, చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య సంప్రదింపుల (కన్సల్టేషన్) డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది.

## ప్రణయ్ హత్య కేసు దోషి అబ్దుల్ బారీ మృతి..

**గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత**



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 24 (ప్రజామంటలు):** రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మిర్యాలగూడ అమృత-ప్రణయ్ పరువు హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న ఏ-4 నిందితుడు అబ్దుల్ బారీ (52) కన్నుమూశాడు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఉన్న అతనికి గురువారం తెల్లవారు జామున తీవ్రమైన గుండెనొప్పితో అస్వస్థతకు గురికావడంతో జైలు సిబ్బంది వెంటనే సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో అతడు తుదిశ్వాస విడిచాడు. ప్రస్తుతం బారీ మృతదేహాన్ని మార్చురీకి తరలించగా, శుక్రవారం ఉదయం అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు గాంధీ ఆసుపత్రి ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డా.నాగమోహన్ రావు తెలిపారు. నల్లగొండ పట్టణంలోని ప్యారసభాగ్ కాలనీకి చెందిన అబ్దుల్ బారీకి నేర చరిత్ర ఉంది. గతంలో గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్ పాండ్య హత్య కేసులోనూ ప్రధాన నిందితుల్లో ఒకడిగా ఉన్న బారీ జైలు శిక్ష అనుభవించాడు. అనంతరం 2018లో మిర్యాలగూడలో చోటుచేసుకున్న పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసులో ఏ-4గా చేర్చబడ్డాడు. సుదీర్ఘ విచారణ తర్వాత న్యాయస్థానం అతనికి జీవిత ఖైదు విధించడంతో చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు.

# పుష్కరాలకు ముందే పనులు పూర్తి..

**2027 ఫిబ్రవరి 29 లోపు కోటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు..**

**పుష్కర ఘాట్లు కోటేశ్వర స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి లక్ష్మణ్ కుమార్..**







**వెల్గటూర్ సెప్టెంబర్ 24 ( ప్రజా మంటలు ) :** 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ముందే పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలో పుష్కరాల పనులకు మంత్రి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. పుష్కర పనుల్లో భాగంగా ధర్మపురి నియోజకవర్గానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.117 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి పర్యటన సందర్భంగా సుమారు రూ 80 కోట్ల నిధులు కేటాయించాలని కోరగా రూ. 81 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కోటిలింగాల ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 10 కోట్లు కేటాయించిందని పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ.16.13 కోట్లతో నిర్మాణం చేస్తున్నామని మంత్రి తెలిపారు. శంకుస్థాపన చేసిన ఈ పనులు 2027 ఫిబ్రవరి 29 లో పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమం లో మండల స్థాయి నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు పాలొగొన్నారు..

## చింతకుంట చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్





**జగిత్యాల, సెప్టెంబర్ 24 (ప్రజా మంటలు):** జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు వద్ద కొనసాగుతున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి నిమజ్జన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో 700కు పైగా వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారని తెలిపారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా మున్సిపాలిటీ, పోలీస్, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారని అభినందించారు. జగిత్యాల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పట్టణంలోని ప్రతి వార్డుకు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు నిధులు కేటాయించి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ చింతకుంట చెరువు వద్ద నిమజ్జనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, రాబోయే రోజుల్లో పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించేలా ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కోఆప్షన్ సభ్యులు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఓయూకు హామీ ఇచ్చిన రూ.1,000 కోట్లు ఏమయ్యాయి? ప్రశ్నించిన కవిత






**హైదరాబాద్, సెప్టెంబర్ 24 (ప్రజా మంటలు):** ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం ప్రకటించిన రూ.1,000 కోట్ల నిధులు ఏమయ్యాయని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఓయూ లా కాలేజ్ విద్యార్థులు కనీస సౌకర్యాల కోసం నెలల తరబడి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఓయూ లా కాలేజీలో జరిగిన వినాయక ఉత్సవాల్లో పాల్గొన్న కవిత మాట్లాడుతూ, దాదాపు పది నెలలుగా విద్యార్థులకు మెస్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి సమస్యతో పాటు విద్యార్థుల గదుల్లోకి పాములు వస్తున్న పరిస్థితి ఉందన్నారు. యూనివర్సిటీ డిస్పెన్సరీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకే అందుబాటులో ఉంటుండటంతో అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఐదారు నెలలుగా విద్యార్థులు రోడ్డుపై వంటలు చేసుకుంటూ నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. మంత్రి సీతక్క కూడా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థేనని, విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. వినాయక చవితి వేడుకలను కూడా ఇబ్బందుల మధ్య నిర్వహించుకోవాల్సి వస్తోందని కవిత అన్నారు. లా కాలేజ్ విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే విద్యార్థులతో కలిసి ఆందోళనలో పాల్గొంటామని ఆమె తెలిపారు.

## 22ఏ భూములపై కీలక నిర్ణయం.. రిజిస్ట్రేషన్లకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్

**22ఏ జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం**

**జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ అనుమతి ఉన్న ప్లాట్లు, భవనాలకు వర్తింపు**

**తక్షణమే అమల్లోకి వచ్చిన ప్రభుత్వ తాజా ఆదేశాలు**

**వేలాది మంది ఆస్తి యజమానులకు దక్కనున్న భారీ ఊరట**

**అక్రమాలపై విచారణకు శ్రీదేవసేన నేతృత్వంలో ప్రత్యేక కమిటీ**

రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరిన భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేలాది మంది ఆస్తి యజమానులకు భారీ ఊరట కల్పించింది. 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ... జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి అనుమతులు పొందిన లేఅవుట్లు, భవనాలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేయగా, అవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. సాంకేతిక కారణాలు లేదా రెవెన్యూ వర్గీకరణల వల్ల 22ఏ జాబితాలో చేరినప్పటికీ, చట్టబద్ధమైన ప్రణాళికా సంస్థల నుంచి అనుమతులు ఉంటే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన ఆస్తుల యజమానులు ఇకపై నేరుగా తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా, ఇతరులకు బదిలీ చేసేందుకు కూడా మార్గం సుగమమైంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక హౌసింగ్ కాలనీల నివాసితులకు ఈ నిర్ణయం పెద్ద ఉపశమనం కలిగించనుంది. చాలాకాలంగా స్తంభించిపోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి ఊపందుకుంటాయని భావిస్తున్నారు. ఈ ప్రయోజనం పొందాలనుకునే యజమానులు సంబంధిత పత్రాలతో అధికారులకు దరఖాస్తు చేసుకుని, తమ ఆస్తులపై ఉన్న రిజిస్ట్రేషన్ ఆంక్షలను తొలగించుకోవచ్చని రెవెన్యూ శాఖ సూచించింది. మరోవైపు, 22ఏ భూముల అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చ అనంతరం ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన చైర్‌పర్సన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా సభ్యులుగా ఉంటారు. ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా ఈ కమిటీలో భాగస్వాములుగా ఉంటారు. 22ఏ భూముల విషయంలో జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఈ కమిటీ విచారణ చేపట్టనుంది. ఈ కమిటీ పరిధి కేవలం 22ఏ అంశానికే పరిమితం కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# స్పీకర్ చాటున దాక్కోవచ్చని భావించిన రాహుల్, రేవంత్‌లకు ఇది "సుప్రీం చెంపపెట్టు": కేటీఆర్

**దానం నాగేందర్ అనర్హతను సమర్థించిన సుప్రీంకోర్టు**

**ఇది రాహుల్, రేవంత్‌కు తగిలిన చెంపపెట్టు అన్న కేటీఆర్**

**ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించాలని చూశారని విమర్శ**

**రాజ్యాంగాన్ని కాపాడాలనే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి బయటపడిందన్న హరీశ్ రావు**

**పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని రాహుల్‌కు సవాల్**



బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిలిన "సుప్రీం చెంపపెట్టు" అని అభివర్ణించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి దానం నాగేందర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. "ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించి, స్పీకర్ చాటున దాక్కోవచ్చని రాహుల్, రేవంత్ భావించారు. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే వారి ప్రయత్నాలను ఈ తీర్పు బట్టబయలు చేసింది" అని కేటీఆర్ ఆరోపించారు. త్వరలో ఖైరతాబాద్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో ప్రజలు మూడేళ్ల ద్రోహానికి, హామీల ఉల్లంఘనకు తగిన తీర్పు ఇస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అని హెచ్చరిస్తూ, తన పోస్ట్ చివరలో "మార్క్ మై వర్డ్స్, ఎమ్మెల్యే చోర్ ఏరాహుల్‌గాంధీ" అని ఘాటుగా విమర్శించారు.

**కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై హరీశ్ రావు ఫైర్**

సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు కూడా స్వాగతించారు. "రాజ్యాంగాన్ని కాపాడతాం" అని చెప్పే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఇది చెంపపెట్టు అని అన్నారు. "పదేపదే 'సంవిధాన్ బచావో' అని నినదించే రాహుల్ గాంధీకి ఇప్పుడు అసలైన పరీక్ష ఎదురైంది. ఆయనకు నిజంగా రాజ్యాంగంపై నమ్మకం ఉంటే, కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలందరితో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజా తీర్పు కోరాలి" అని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడి, తెలంగాణలో తమ పార్టీ చర్యలపై మౌనంగా ఉండటం సరికాదని హరీశ్ రావు విమర్శించారు. "సంవిధాన్ బచావో అనేది రాజ్యాంగ నిబద్ధతా లేక కేవలం రాజకీయ నినాదమా?" అని ఆయన ప్రశ్నించారు.

# స్లీపర్ బస్సులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు

**9 మంది సజీవదహనం**

**ఉత్తరప్రదేశ్‌లో ఘోర బస్సు ప్రమాదం**

**యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై స్లీపర్ బస్సులో అకస్మాత్తుగా మంటలు**

**మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన రాష్ట్రపతి**

**పరిహారం ప్రకటించిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్**



ఉత్తర్‌ప్రదేశ్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. గ్రేటర్ నోయిడాలోని జేవార్ విమానాశ్రయం సమీపంలో యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై వెళ్తున్న ప్రైవేట్ స్లీపర్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఒక మహిళ, ఎనిమిది మంది పురుషులు సహా మొత్తం తొమ్మిది మంది సజీవ దహనమయ్యారు. మరికొందరు గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 50 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బిహార్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న రాజ్ కల్పనా ట్రావెల్స్ బస్సు 50 మంది ప్రయాణికులతో దిల్లీ నుంచి మహోబా వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. ప్రయాణికులు నిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఎక్స్‌ప్రెస్‌వే పక్కకు ఆపాడు. అయితే క్షణాల్లోనే మంటలు వేగంగా వ్యాపించడంతో పాటు దట్టమైన పొగ బస్సు మొత్తం కమ్మేసింది. దాంతో ప్రయాణికుల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రాణభయంతో కొందరు ప్రయాణికులు తమ వస్తువులను అక్కడే వదిలేశారు. బస్సు నుంచి బయటపడేందుకు కొందరు కిటికీల నుంచి దూకారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు సహా పలువురు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే తొమ్మిది మంది మాత్రం మంటల్లో చిక్కుకుని బయటకు రాలేక ప్రాణాలు కోల్పోయారు.సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారని అధికారులు తెలిపారు. ఐదు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారని అన్నారు. అయితే అప్పటికే బస్సులోని కొంతమంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకున్నారని వెల్లడించారు. ఘటన అనంతరం పోలీసులు, ఫోరెన్సిక్ బృందాలు దర్యాప్తు చేపట్టాయి. ప్రాథమిక విచారణ ప్రకారం, బస్సు ఏసీ వ్యవస్థలో ఏర్పడిన నిప్పురవ్వ కారణంగా ఇంజన్ లూబ్రికెంట్ ఆయిల్‌కు మంటలు అంటుకుని వేగంగా వ్యాపించినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి పూర్తి కారణాలపై పోలీసులు, ఫోరెన్సిక్ బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. ప్రమాదం తర్వాత యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. కాలిపోయిన బస్సును అక్కడి నుంచి తొలగించే చర్యలు చేపట్టారు. మృతుల గుర్తింపు, గాయపడిన వారి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, బస్సు డ్రైవర్, కండక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.బస్సులో మంటలు చెలరేగిన సమయంలో ఎక్కువ మంది ప్రయాణికులు నిద్రపోతున్నట్లు ప్రమాదం నుంచి బయటపడిన వారు తెలిపారు. మంటలు వ్యాపిస్తున్న విషయం గుర్తించేలోపే బస్సు మొత్తం దట్టమైన పొగతో నిండిపోయిందని చెప్పారు. దీంతో ఎటు వెళ్లాలో తెలియక ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారని తెలిపారు. పొగ కారణంగా బస్సు నుంచి బయటకు రావడం కష్టంగా మారిందని ఓ ప్రయాణికురాలు చెప్పారు. ఒక్కసారిగా ప్రయాణికులంతా బయటకు పరుగులు తీయడంతో తోపులాట జరిగిందని, ఈ గందరగోళం కారణంగా కొందరు ప్రాణాలు కోల్పోయారని వాపోయారు. "నేను నిద్రపోయిన తర్వాత బస్సుకు నిప్పంటుకుంది. ఎవరో నన్ను నిద్రలేపడంతో వెంటనే బయటకు రావడానికి ప్రయత్నించాం. దట్టమైన పొగ కారణంగా బయటపడటం చాలా కష్టంగా మారింది. తీవ్ర భయాందోళన మధ్య ఎలాగోలా బస్సు నుంచి బయటకు వచ్చాం. బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంది.ఈ ఘోర ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన వారికి సరైన చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు పరిహారం ప్రకటించారు. ప్రమాదంపై అధికారులు తదుపరి చర్యలు చేపడుతున్నారు.

# ప్రభుత్వ పథకాల ప్రచారానికి ఇన్‌ఫ్లుయెన్సర్లు

**నెలకు రూ.1.50 లక్షల వరకు**

**సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు వేగంగా చేరవేసేందుకు కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది**

**సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ఎంప్యానెల్‌మెంట్ పాలసీకి ఆమోదం తెలిపింది**

**ఇకపై క్రియేటర్ల ద్వారా సోషల్ మీడియాలో ప్రభుత్వం ప్రచారం నిర్వహించనుంది**

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు మరింత వేగంగా చేరవేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ఎంప్యానెల్‌మెంట్ పాలసీ'కి కేబినెట్ ఆమోదం లభించింది.ఈ విధానం ప్రకారం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ వేదికల్లో ప్రభావం ఉన్న క్రియేటర్లను ఎంప్యానెల్ చేసి ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో భాగస్వాములను చేయనున్నారు. తొలుత ఏడాది కాలానికి ఒప్పందం కుదుర్చుకుని, పనితీరు సంతృప్తికరంగా ఉంటే మరో రెండేళ్ల వరకు పొడిగించే అవకాశం కల్పించారు. గోవా, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేసిన తర్వాత ఈ పాలసీని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది.సామాజిక మాధ్యమ క్రియేటర్లను ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా నాలుగు కేటగిరీలుగా విభజించారు. లక్ష మందికి పైగా ఫాలోవర్లు ఉన్నవారిని కేటగిరీ-ఏ, 50 వేల నుంచి 99,999 మంది వరకు ఉన్నవారిని కేటగిరీ-బీ, 25 వేల నుంచి 49,999 మంది వరకు ఉన్నవారిని కేటగిరీ-సీ, 10 వేల నుంచి 24,999 మంది వరకు ఉన్నవారిని కేటగిరీ-డీగా పరిగణిస్తారు. ఏదైనా ఒక సామాజిక మాధ్యమ వేదికలో కనీసం 10 వేల మంది ఫాలోవర్లు ఉంటేనే దరఖాస్తు చేసుకునే అర్హత ఉంటుంది.ఇన్‌ఫ్లుయెన్సర్లు పోస్టు చేసే కంటెంట్ రకాన్ని బట్టి ప్రభుత్వం చెల్లింపులు చేస్తుంది. అత్యధిక రీచ్ ఉన్న ఒక్క ప్రధాన ప్లాట్‌ఫామ్‌కే నగదు చెల్లింపు ఉంటుంది. అయితే అదే కంటెంట్‌ను తమ ఇతర సామాజిక మాధ్యమ ఖాతాల్లో ఉచితంగా పోస్టు చేయడం తప్పనిసరి. ఒక క్రియేటర్‌కు నెలకు గరిష్ఠంగా రూ.1.50 లక్షలు చెల్లించే పరిమితిని నిర్ణయించారు.ప్రభుత్వం అందించే గ్రాఫిక్ పోస్టులకు కేటగిరీ-ఏకు రూ.1,500, బీకి రూ.1,000, సీకి రూ.750, డీకి రూ.500 చొప్పున చెల్లిస్తారు. ప్రభుత్వం అందించే ఆడియో, వీడియో పోస్టులకు కేటగిరీ-ఏకు రూ.2,000, బీకి రూ.1,500, సీకి రూ.1,000, డీకి రూ.750 చొప్పున ఇస్తారు. క్రియేటర్లు స్వయంగా రూపొందించే వీడియోలకు కేటగిరీ-ఏకు రూ.15,000, బీకి రూ.7,500, సీకి రూ.5,000, డీకి రూ.2,500 చొప్పున పారితోషికం చెల్లించనున్నారు.ప్రత్యేక యాప్, పోర్టల్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తారు. స్క్రూటినీ కమిటీ పరిశీలనతో పాటు రెండు దశల తనిఖీల అనంతరం ఎంపికైన వారికి ఎంప్యానెల్‌మెంట్ కార్డులు జారీ చేస్తారు. గత 60 పోస్టులను పరిశీలించి అశ్లీల, విద్వేషపూరిత లేదా అభ్యంతరకర వ్యాఖ్యలు ఉంటే దరఖాస్తును తిరస్కరిస్తారు. ఒప్పంద కాలం మొత్తం కూడా ఈ అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.కనీసం రెండు పోస్టులు లేదా వీడియోలు తమ మొత్తం ఫాలోవర్ల సంఖ్య కంటే ఎక్కువ వ్యూస్ సాధించి ఉండాలి. గత ఆరు నెలల్లో వారానికి రెండు పోస్టుల చొప్పున 48కు పైగా మంచి రీచ్ ఉన్న పోస్టులు చేసిన రికార్డు ఉండాలి. ప్రభుత్వానికి సంబంధించిన ఫ్యాక్ట్ చెక్ పోస్టులను ఉచితంగా ప్రచారం చేయడం తప్పనిసరి. ఈ నిబంధనను పాటించకపోతే ఎంప్యానెల్‌మెంట్ రద్దు చేస్తారు. 18 ఏళ్లు నిండిన వ్యక్తులు మాత్రమే నమోదు చేసుకునే అవకాశం ఉండగా, కంపెనీలు, సంస్థలకు ఈ విధానంలో అవకాశం లేదు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని బ్లాక్‌లిస్ట్‌లో చేర్చనున్నారు.సామాజిక మాధ్యమ క్రియేటర్లకు పారితోషికం చెల్లించే విధానం ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అమల్లో ఉంది. హిమాచల్‌ప్రదేశ్‌లో కేటగిరీల వారీగా నెలకు రూ.2 లక్షలు, రూ.1 లక్ష, రూ.50 వేలు, రూ.10 వేల వరకు చెల్లిస్తున్నారు. రాజస్థాన్‌లో నెలవారీ గౌరవ వేతనంగా రూ.25 వేలు, రూ.15 వేలు ఇస్తున్నారు. పంజాబ్‌లో వీక్షణలు, ప్రాథమిక రేటు ఆధారంగా చెల్లింపులు చేస్తుండగా, ఉత్తర్‌ప్రదేశ్‌లో సామాజిక మాధ్యమ వేదికల ఆధారంగా గరిష్ఠ పరిమితిని నిర్ణయించారు. అక్కడ ఎక్స్‌కు రూ.5 లక్షలు, ఫేస్‌బుక్‌కు రూ.4 లక్షలు, ఇన్‌స్టాగ్రామ్‌కు రూ.3 లక్షలు, యూట్యూబ్ వీడియో కంటెంట్‌కు రూ.8 లక్షల వరకు నెలకు చెల్లింపులు చేస్తున్నారు.

# పోలీస్ జాబ్ అర్హత మార్కుల్లో మార్పులు

**30 శాతం సాధిస్తే క్వాలిఫై అయినట్లే**

**తెలంగాణలో నవంబర్ 29న ఎస్సై, డిసెంబర్ 20న కానిస్టేబుల్‌కు సంబంధించిన ప్రిలిమినరీ రాత పరీక్షలు నిర్వహించనున్నారు**

**ఎస్సైకి 1,60,756, కానిస్టేబుల్‌కు 3,89,356 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.**




తెలంగాణ పోలీస్ ఉద్యోగాల్లో భాగంగా యూనిఫాం సర్వీసులకు సంబంధించి ప్రిలిమినరీ రాత పరీక్షకు సన్నద్ధతపై అభ్యర్థులు దృష్టి సారించారు. నవంబర్ 29న రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల వారీగా ఆయా కేంద్రాల్లో ఎస్సై, డిసెంబర్ 20న కానిస్టేబుల్, అందుకు సమాన స్థాయి పోస్టులకు సంబంధించి 15 నుంచి 18 కేంద్రాల్లో రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు మండలి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈసారి ఎస్సై, ఆ స్థాయి పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్, ఆ స్థాయి పోస్టులకు 3,89,356 మంది అభ్యర్థుల నుంచి అప్లికేషన్లు వచ్చాయి.2022 నాటి నోటిఫికేషన్‌తో పోల్చితే ఈసారి కనీస అర్హత మార్కుల్లో స్వల్ప మార్పులు చోటు చేసుకోవడం గమనార్హం. క్రితంసారి అభ్యర్థులందరికీ కనీస అర్హత మార్కుల్ని 30 శాతంగానే పరిగణించారు. ఈసారి మాత్రం దీనిని మరింతగా కుదించడం పలువురు అభ్యర్థులకు చాలా వరకు కలిసి వచ్చే అంశంగా మారింది. ఈసారి పీడబ్ల్యూటీ (ప్రిలిమినరీ ఎగ్జామ్ టెస్ట్)లో అర్హత కోసం ఓసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 30 శాతం మార్కులే సాధించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ లెక్కన పీడబ్ల్యూటీలో మొత్తం 200 మార్కులకు గానూ కనీసం 60 మార్కులు సాధిస్తే ఈ పోటీలో తొలిమెట్టు గట్టెక్కినట్లే. మిగిలిన కేటగిరీల అభ్యర్థులకు మరింత తక్కువగానే కనీస మార్కులను నిర్ణయించారు. బీసీ అభ్యర్థులైతే 25 శాతం (50 మార్కులు), ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనిక ఉద్యోగులు, హోంగార్డులకైతే 20 శాతం (40) మార్కులను మాత్రమే అర్హతగా నిర్ణయించారు.వాస్తవానికి ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలోనే జరగనున్నప్పటికీ దీన్ని బోర్డు అధికారులు వడబోత పరీక్షగానే పరిగణిస్తున్నారు. ఇందులో సాధించిన మార్కుల్ని తుది ఫలితాల్లో పరిగణనలోకి తీసుకోకపోయినా తెలియని సమాధానాల్ని ఊహించి రాస్తే ఎక్కువగా నష్టమే జరిగే ఆస్కారం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్కో తప్పు సమాధానానికి మొత్తం మార్కుల్లో 20 శాతం కోత పెట్టనున్నారు. తెలియని ప్రశ్నలను తేలికగా తీసుకుని వదిలేయడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.పోలీస్ శాఖలో 5,400, ప్రత్యేక భద్రతా దళంలో 1,424, అగ్నిమాపక శాఖలో 790, జైళ్ల శాఖలో 223 పోస్టులు ఉన్నాయి. మొత్తం కలిపి 7,437 ఎస్సై, ఏఎస్సై, కానిస్టేబుల్ తత్సమాన ఉద్యోగాలకు జులై 29న ప్రకటన విడుదలైన సంగతి తెలిసిందే. ఆగస్ట్ 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు దాదాపు 28 రోజుల పాటు ఆన్‌లైన్‌లో అప్లికేషన్లను స్వీకరించారు. అన్ని పోస్టులకు కలిపి 5,77,064 దరఖాస్తులు వచ్చినట్లు బోర్డు ఛైర్మన్ శ్రీనివాస రావు తెలిపారు. దరఖాస్తుదారుల్లో అత్యధికంగా బీసీలు 49.19 శాతం మంది ఉన్నారు. తర్వాతి స్థానంలో ఎస్సీ, ఎస్టీలు 43.60 శాతం మంది ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకున్న 3.45 శాతంతో కలిపి ఓసీల సంఖ్య కేవలం 7.20 శాతంగా ఉంది. అభ్యర్థుల్లో 74.66 శాతం మంది పురుషులు ఉండగా, 25.33 శాతం మంది మహిళలు ఉన్నారు.


# అనుమానాస్పద స్థితిలో నర్సింగ్ విద్యార్థిని మృతి

**ప్రేమను ఒప్పుకోనందుకు అతడే చంపేశాడా**

**బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న విద్యార్థిని తన ఇంటి ఆవరణలోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది**

**అనారోగ్యం కారణంగా ఇంటికి వచ్చిన విద్యార్థిని ఇంటి వెనక భాగంలో విగతజీవిగా పడి ఉండటం కలకలం రేపింది.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో నర్సింగ్ విద్యార్థిని హరిణి అనుమానాస్పద మృతి ఘటన కలకలం రేపుతోంది. పట్టపగలు తన ఇంటివెనకే యువతి దారుణ స్థితిలో మృతి చెందింది. శరీరంపై బలమైన గాయాలుండటం చూసి హత్య చేసినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. ఇదే జిల్లా ములకపల్లికి చెందిన ఆదివాసీ నర్సింగ్ విద్యార్థి శిరీష హత్యకు గురై నెల రోజులు గడవక ముందే మరో దళిత యువతిని హత్య చేయడం సంచలనంగా మారింది. వరుస హత్యల పట్ల ఆదివాసీ, దళిత సంఘాలు, రాజకీయ పక్షాల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడుకు చెందిన ఇంద్రవెల్లి సతీశ్, రాజేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. సతీశ్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, ఆ కుటుంబ బాధ్యతలు తల్లిపైనే పడ్డాయి.పెద్ద కుమార్తె హరిణి ఇంటర్ పూర్తి చేసి ఖమ్మం జిల్లా తనికెళ్ల సమీపంలోని ఓ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ఫస్టియర్ చదువుతోంది. చిన్న కుమార్తె అన్విత గురుకులంలో ఏడో తరగతి చదువుతోంది. ఇద్దరు పిల్లల చదువుల కోసం తల్లి మిషన్ కుట్టు పని, కూలీ పనులకు వెళ్తోంది.నర్సింగ్ చదువుతున్న హరిణి అనారోగ్యం కారణంగా 20 రోజుల క్రితం కాలేజీ నుంచి కొత్తగూడెంలో ఉంటున్న పిన్ని ఇంటికి వెళ్లింది. అక్కడ నుంచి 3 రోజుల క్రితం వెంగన్నపాలెంలోని తల్లి వద్దకు వచ్చింది. ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటల సమయంలో తల్లి రాజేశ్వరి బయటకు వెళ్లింది. గంట తర్వాత ఇంటికి రాగా కుమార్తె హరిణి కనిపించలేదు. ఇంటి ఆవరణలో వెతకగా బాత్‌రూం దగ్గరలోని చెత్తలో మృతదేహం కనిపించింది. విగతజీవిగా ఉన్న కుమార్తెను చూసి తల్లి కన్నీరుమున్నీరవుతోంది.హరిణిది కచ్చితంగా హత్యగానే బంధువులు, కుటుంబసభ్యులు బలంగా చెప్పడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆ గ్రామానికి చెందిన ఓ యువకుడు కొన్నాళ్లుగా పెళ్లి చేసుకోవాలని బలవంతం చేస్తున్నాడని, యువతి నిరాకరించడంతోనే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానం వ్యక్తం చేస్తున్న యువకుడు సైతం పరారీలో ఉండటంతో అతడే హత్య చేసి ఉంటాడా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేస్తున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు.నా పెద్ద కుమార్తె బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. జ్వరం రావడంతో గురుకులం నుంచి ఇంటికి వచ్చింది. నేను 3 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లాను. గంట తర్వాత ఇంటికి వచ్చాక నా బిడ్డ హరిణి కనిపించలేదు. ఇంటి చుట్టూ వెతికితే చెత్తకుప్పలో శవం దొరికింది.హరిణి మృతదేహం శవపరీక్షకు కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పలు రాజకీయ పక్షాలు, దళిత సంఘాలు, మహిళా సంఘాలు భారీగా అక్కడకు చేరుకున్నాయి. జిల్లాలో వరుస హత్యల పట్ల నిరసనలు వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శవపరీక్ష అనంతరం జూలూరుపాడులో మృతదేహంతో దళిత సంఘాలు, బంధువులు రాస్తారోకోకు దిగారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళనకారుల వద్దకు చేరుకుని నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు.



# తీరం దాటిన తీవ్ర వాయుగుండం

**తెలుగురాష్ట్రాలకు భారీ వర్ష సూచన**

**శ్రీకాకుళం జిల్లాలో తీవ్ర వాయుగుండం తీరం దాటింది**

**తీరం దాటినా భూభాగంపై తీవ్రవాయుగుండంగానే కొనసాగుతోంది**

**ఈ ప్రభావంతో తెలుగురాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది**



బంగాళాఖాతం తీరంవైపు దూసుకొచ్చిన తీవ్ర వాయుగుండం ఎట్టకేలకు తీరం దాటింది. బుధవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత తీవ్ర వాయుగుండం తీరాన్ని తాకింది. కొన్ని గంటలపాటు తీరందాటే ప్రక్రియ కొనసాగింది. ఇవాళ తెల్లవారుజామున శ్రీకాకుళం జిల్లాలోని కళింగపట్నానికి నైరుతి దిశలో తీరం దాటింది. అయితే తీరం దాటినా భూభాగంపై తీవ్రవాయుగుండంగానే కొనసాగుతోంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తీర ప్రాంతాల్లో సముద్ర అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. మత్స్యకారులను సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు.ఇప్పటికే ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అత్యవసర సహాయ చర్యల కోసం విశాఖ, అల్లూరి, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల్లో 5 ఎస్డీఆర్ఎఫ్, 4 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించినట్లు అధికారులు పేర్కొన్నారు. తీవ్ర వాయుగుండం దృష్ట్యా విపత్తుల సంస్థ స్టేట్ కంట్రోల్ రూమ్ 112, 1070, 1800-425-0101 టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

# నిశ్శబ్దంగా వ్యాపిస్తోన్న హెచ్1ఎన్1 వైరస్

**జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్స్**

**తెలంగాణలో ఇన్‌ఫ్లుయెంజా ఏ (హెచ్1ఎన్1) వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి**

**ప్రధానంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉండేవారిపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటోంది**

**దీంతో వైరస్ పట్ల వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు.**



రాష్ట్రంలో ఇన్‌ఫ్లుయెంజా ఏ (హెచ్1ఎన్1) వైరస్ చాప కింద నీరులా వ్యాపిస్తోంది. హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇలాంటి కేసుల తాకిడి పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దీని ద్వారా చాలా మంది ఇబ్బందికి గురికాకపోయినప్పటికీ కొందరిలో తీవ్ర న్యుమోనియాకు దారితీస్తోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రేటర్‌లో ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో ఇటీవల ఈ వైరస్ కారణంగా ఒక రోగి మరణించినట్లు సమాచారం. అయితే వైద్యారోగ్య శాఖ మాత్రం దీన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు.దిల్లీ, కర్ణాటక వంటి రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో హెచ్1ఎన్1 వైరస్ కేసుల సంఖ్య తక్కువగా ఉంది. అయినప్పటికీ ఈ వైరస్ సులభంగా వ్యాపిస్తుందని, అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇన్‌ఫ్లుయెంజా సోకిన వ్యక్తి దగ్గినా లేదా తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. అందుకే తరచుగా చేతులు శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యమని, మాస్క్ ధరించడం ఉత్తమమని డాక్టర్లు చెబుతున్నారు.రోగనిరోధక శక్తి తక్కువగా ఉండేవారిపై వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, ఊపిరితిత్తులు లేదా గుండె సంబంధిత సమస్యల వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉన్నవారు ఫ్లూ బారినపడి తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. అయితే ఫ్లూ సోకిన ప్రతి ఒక్కరికీ యాంటీవైరల్ మందులు అవసరం లేదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. తీవ్రమైన లక్షణాలు ఉన్నవారు మాత్రమే యాంటీవైరల్ మందులను వాడాలని చెబుతున్నారు. అదీ కూడా వైద్యుల సలహా మేరకే వినియోగించాలని సూచిస్తున్నారు. లక్షణాలు కనిపించిన 48 గంటల్లోపు ఈ మందులను వాడితే మెరుగైన ఫలితాలు ఉంటాయంటున్నారు.

# తిరుపతి వేదికగా అఖిల భారత డీజీపీల సదస్సు

**హాజరుకానున్న ప్రధాని మోదీ, అమిత్ షా**

**డిసెంబర్‌లో తిరుపతి వేదికగా 61వ అఖిల భారత డీజీపీల సదస్సు**

**హాజరు కానున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా**

**పాల్గొననున్న దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డీజీపీలు**

**తిరుపతి ఐసర్ క్యాంపస్‌లో ఈ కీలక సమావేశం**



ప్రతిష్ఠాత్మక 61వ అఖిల భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)ల సదస్సుకు తిరుపతి జిల్లా ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఏడాది డిసెంబర్ మొదటి వారంలో ఈ ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. జాతీయ భద్రత, పోలీసు వ్యవస్థ పనితీరు వంటి కీలక అంశాలపై చర్చించే ఈ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నట్లు తెలుస్తోంది.తిరుపతి జిల్లాలోని ఏర్పేడు సమీపంలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్) ప్రాంగణం ఈ సదస్సుకు వేదిక కానుంది. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ కూడా పాల్గొంటారు.ఈ సదస్సులో దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల డీజీపీలు, కేంద్ర నిఘా సంస్థల అధిపతులు పాల్గొని దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తారు. వీరితో పాటు దేశవ్యాప్తంగా సుమారు 400 మంది ఐపీఎస్ అధికారులు ఈ సమావేశానికి హాజరవుతారని సమాచారం. జాతీయ స్థాయిలో ఇంతటి కీలకమైన సమావేశం ఏపీలోని తిరుపతిలో జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

# అమరావతిలో ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి 'ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్' కార్యాలయాన్ని కేటాయిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి పేరుతో గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.ఈ కొత్త కార్యాలయం ఏర్పాటు కోసం 'ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025' కింద గతంలో జారీ చేసిన నోటిఫికేషన్లలో కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసింది. పాత జాబితాలో 8వ సీరియల్ నంబర్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అక్కడి నుంచి తొలగించి, కొత్తగా 17వ సీరియల్ నంబర్‌లో "ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, అమరావతి" పేరుతో చేర్చారు. ఈ కార్యాలయం పరిధిలోకి మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వస్తుంది.ఈ కొత్త ఎఫ్ఆర్ఆర్వో ఆఫీస్ ద్వారా రాష్ట్రానికి వచ్చే విదేశీయుల నమోదు, వారి వీసాల పొడిగింపు, వీసా మార్పిడులు, ఇతర ఇమ్మిగ్రేషన్‌కు సంబంధించిన అన్ని రకాల సేవలు అందుబాటులోకి వస్తాయి. ముఖ్యంగా రాష్ట్రానికి పర్యటనలు, పనుల నిమిత్తం వచ్చే విదేశీ ప్రతినిధులు, అధికారులకు ఈ కార్యాలయం ఏర్పాటు ఎంతో సౌకర్యవంతంగా ఉండనుంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com